# కథల కాణాచి

(ఆంధ్రపత్రిక ఉగాది సంచిక 1957)

ముకుందాన్ని బెంగుళూరు పిచ్చాసుపత్రిలో పెట్టారన్న వార్త విన్నపుడు కాలచక్రం నిలిచి పోయినట్లనిపించింది. ఆరుగురు అన్నదమ్ముల్లో నాలుగోవాడు ముకుందం. నలభై యేళ్ల నడివయస్కుడు. చదువుకున్నవాడు. దత్తత వల్ల సంక్రమించిన రెండు మేడలు, వొక తోట, యాభై ఎకరాల భూమీ గల స్థితిపరుడు.

మామగారు జిల్లా కలెక్టరు. జ్ఞాపకం వచ్చినపుడల్లా బి.ఎల్. పరీక్షకి కడుతుంటాడు కాని, ఉద్యోగం చేసే అవసరంగాని, అభిలాషగాని అతనికి లేవు. అన్నదమ్ములందరూ మంచి పదవుల్లో వున్నారు. కుటుంబంలో ఎవరికీ పిచ్చెత్తినట్లు లేదు. మనోవ్యాకులత, చీకూ చింత లేకుండా హాయిగా జీవితం గడిచిపోతున్నపుడు, ముకుందం పిచ్చాసుపత్రిలో ఎందుకు గడపవల్సి వచ్చిందో నాకర్థం కాలేదు. నాకు పిచ్చెత్తినట్లయింది. కాలచక్రం కదలనట్లనిపించింది. కాలచక్రం కవి మెళకువ, రచనా శిల్పంలో అదొక విసురు. దాని గొడవ ఎవరిక్కావాలి?

రెండవ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైందన్న వార్త తెలిసినపుడూ, మహాత్ముడు పరమ పదించాడన్న వార్త విన్నపుడు వో క్షణం పాటు కాలచక్రం నిలిచి పోయినట్లనిపించింది. మళ్లా ముకుందం పిచ్చి విషయం తెలిసినప్పుడు అట్లాంటి అనుభవం కలిగింది. వైమానికుడు సహారా ఎడారనుకుని నేలమీదకి దిగి అడుగుపెట్టగానే ఎటు చూసినా మంచే. జలపాతం వొంపు దగ్గర నిలిచిపోయింది. ఇట్లాంటివి జరిగినపుడు వూపిరి బిగబడతాం. గుండె కొట్టుకోవడంలో ఒక లయ, క్రమం వుంటాయిట. మధ్యలో ఒకసారి కొట్టుగోడం మానేసి-వొక బీట్ విడిచేసి, తరువాత మళ్లా మామూలుగా గుండె కొట్టుకోవడం అసంభవం కాదని వైద్యశాస్త్రజ్ఞులు చెబుతున్నారు. మధ్యనున్న స్థలం గుండా ప్రయాణం చెయ్యకుండానే, వొక పదార్థం వొక చోటు నుండి మరొక చోటుకి చేరుకోవడం సంభవమేనని భౌతిక శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఇట్లాంటివి సంభవమైనపుడు, ముకుందానికి పిచ్చెత్తడం మాత్రం ఎందుకు సంభవం కాకూడదనుకుని సమాధానపడినా, ఆ అనుభూతి అన్వేషణకి నన్ను పురిగొల్పింది. వ్రాశేస్తే, ముకుందం వ్యక్తిత్వం విశదపడుతుందేమో నన్న ఆశతో యీ రచనకి వుపక్రమించాను.

ముకుందం అనేక మంది సామాన్య వ్యక్తులలో వొకడైతే అతన్ని గురించి నేను పట్టించుకోను. ఓ రకంగా అతను అపూర్వ వ్యక్తి. ఆధునిక యుగంలో ఆనందాన్ని సాధించగల వ్యక్తులు అరుదు. నాతోటి మానవులలో 'నా జీవితం హాయిగా, సంతోషంగా గడిచిపోతోంది' అని అన్నవారు నాకుతటస్థపడలేదు. మనలో ప్రతి వారికి ఏదో లోటు. ఆరోగ్యం వుండదు, అవకాశాలుండవు, డబ్బుండదు. ప్రేమదొరక్క చెడిపోతాం. తీరిక కోసం పని చేసి పొందిన తీరికలో యింకా పని చేస్తాం. ఏకాంతం లేదు. ఇల్లొక జైలు. ఇందులోంచి తప్పించుకుని గుంపులో కలిసిపోతాం. మరో వ్యక్తి సమక్షంలో కాని మనం సజీవులమై వున్న విషయం ఋజువు

# కాలచక్రం నిలిచింది

'బుచ్చిబాబు'

కాదు. కుళ్లు, కృత్రిమ, జాడ్యం, దాస్యం, నిద్రలో కూడా విరామంలేని మనోవ్యాకులత-యీ మహా గంద్రగోళంలో పరిభ్రమిస్తూ వున్న యీ వ్యక్తులందరికీ ఎందుకు పిచ్చెత్తలేదా



అన్న సంశయం వొస్తుంది. పిచ్చెత్తకుండా, మామూలుగా వున్న వారుంటే కదా. పిచ్చి మందాన్ని కొలిచి విలువ కట్టడానికి!

ఆనందమయ జీవి ముకుందం. ఆ విధంగా అతను అపూర్వమైన వ్యక్తి. మరో విశేషం వుంది. ముకుందం లాంటి వ్యక్తులు మన సంఘంలో చాలా మంది వున్నారు. ఆ రకం మనస్తత్వం గల వారికి అతను ప్రతినిధి. ఎప్పుడో ఒకప్పుడు ముకుందాన్ని, అతని తెగ వారిని కలుసుకోక తప్పదు. వారిని మీరు ప్రేమించవొచ్చు, ద్వేషించవొచ్చు. కాని వారి బారి నుండి తప్పించుకు పారిపోలేరు. ఆఫీసుల్లో, క్లబ్బుల్లో, పార్కుల్లో సినిమా హాలుల్లో, దుకాణాలలో, రైలు ప్రయాణంలో, ఎక్కడో అక్కడ అతన్ని మీరు కలుసుకునే వుంటారు. ఎవరతను? అత నొక మాటకారి. వాగు డురాయుడు. అతను మాట్లాడటం మొదలెడితే మరి ఆగడు. ఎవరూ అతన్ని ఆపలేరు. పిడుగుపైన బడినప్పుడు ఎవరు తప్పించుకో గలరు? జలపాతాన్ని అరచేతితో ఆపడం ఎంత సులువో అతని నాలుక పరిభ్రమణాన్ని ఆపడం అంత సులువు. ఈపాటికి మీరు గ్రహించే వుంటారు. ఆంగ్లంలో అతన్ని 'బోర్' అంటారు. ఎన్నో హాస్యపత్రికలు, ఎందరో హాస్య రచయితలు అతని వూసులు చెప్పకుని రోజులు గడుపుకుంటున్నారు.

అతని గాథలు వేనోళ్లవింటాం. అతనొక పురాణ పురుషుడు. ముకుందం మంత్రజాలంలో చిక్కుకుని గిలగిల తన్నుకుని బైటపడిన వాళ్లల్లో నేనొకణ్ణి. అతన్ని ద్వేషించాను. విమర్శించాను. నిర్మూలం చేయాలని సంకల్పించాను. వెక్కిరించాను. హేళన చేశాను. జాలిపడ్డాను. చివరికి ప్రేమించాను. అతను లేని యీ ప్రపంచానికి నాకర్థం కనబడలేదు. అతన్ని పిచ్చాసుపత్రిలో పెట్టిన యీ ప్రపంచానికి పిచ్చి.

ఈ రకంగా ప్రపంచంపై కోపించి నేను సాధించేదేదీ లేదు. అందుచేత తమాయించుకుని ముకుందంతో నా పరిచయాన్ని ఉద్రేక రహితమైన దృక్పథంతో స్మరిస్తాను.

ముకుందాన్ని గురించి కుతూహలపడటానికి ఏవేవో చాలా కారణాలు చెప్పాను కాని అసలు విషయం వొదిలేశాను. అతనితో దూరపు బంధుత్వం వుంది. ఆవిడ తాలూకు దూరపు చుట్టం-నా తాలూకే అని చెప్పకోడంలో చిన్నతనం వుందని కాదుస్మండి-అసలు విషయం అది.

ఆదివారం ఉదయం తొమ్మిదైంది. వీధి లోకని బయలుదేరి పదిమెట్లు దిగాను. పదకొండో మెట్టు మీద ముకుందం ప్రథమంగా తటస్థపడ్డాడు. తను ఫలానా అని పరిచయం చేసుకున్నాడు. "ఓహో అల్లానా-మిమ్మల్ని గురించి-వినడమే కాని ఎప్పుడూ చూడలేదు-రండి, రండి, లోపలికెడదాం" అని ఆహ్వానించాను. బుజం మీద చెయ్యేసి నన్ను నిలిపేశాడు.

"నన్ను గురించి విన్నారన్నమాట. చూసిం తర్వాత, ఇదేమిట్రా ఎందుకు చూశాను? అని అనిపించలేదు కదా! ఏముసిలాడినో, ముక్కాడినో అనుకున్నారా? అమ్మాయి చెప్పిందేమోలెండి, నేనంత పెద్దవాణ్ణి-అంటే ముసలి వాణ్ణి కానండోయ్. అసలు ముసిలాళ్లు అంటూ వుండరని నా దృఢ

విశ్వాసం. ప్రతి వాడికీ తనకున్న వయస్సుకి పదిహేనేళ్లు తర్వాతేగాని వార్ధక్యం అంటూ వుండదు. నాకు నలభై అయితే, యాభై అయిదేళ్ల వాళ్లందరూ ముసిలాళ్లన్న మాట. నాకరవై అయితే, డెభై అయిదేళ్ల వాళ్లందరూ వృద్ధులన్న మాట. అదీ 'థీరీ'. మీకు ముప్తై అవునా? మీ వుద్దేశం, నలభై అయిదు దాటిన వాళ్లంతా ముసిలాళ్లు. నేనిక్కడికెందుకొచ్చానన్నా మీ ప్రశ్న-మీకు తెలీదేమో-అమ్మాయి చెప్పలేదేమో-ఇక్కడ బ్రిడ్జి మాచెస్ వున్నాయి. అందుకొచ్చాను. నేను బ్రిడ్జి ఆటగాణ్లెండి. మీకొచ్చా? ఆంధ్రలో ఎక్కడ టోర్నమెంటయినా, మా వాళ్లు నన్ను పంపిస్తూంటారు. యింకెవరూ లేనట్లు. ఏం చేస్తాం. పెద్దలు మన మీద వో భారం పడేసిం తర్వాత మనం నిర్వర్తించకతప్పదు. క్రితం నెలలో బెంగుళూరులో రన్నరప్-పేపర్లో చూశారుగా. అంటే బెంగుళూరు లోకల్ పత్రికల్లో పడ్డాయిట లెండి-ఇక్కడ మన పత్రికలు యూస్‌లెస్. వీళ్ల వుద్దేశంలో బ్రిడ్జి ఒక ఆటేగాదు. నేనే ఇంగ్లండులో పుట్టి వుంటే, యీ నా ఆటకి పార్లమెంట్ మెంబరుగా చేసెయ్యరూ! మావాళ్లు వొచ్చే యేడు ఇంగ్లండు పంపుతామంటున్నారు నన్ను-భారం పడిం తర్వాత..."

## కాలచక్రం నిలిచింది

".....లోపలి కెడదాం......."

"ఒడలోనే వెడతా ననుకోండి. నాకీ ఎయిర్ ట్రావెల్ సుతరామూ యిష్టం లేదు స్మాండి. ఎందుకంటారా విల్లువ్రాసి, గాని విమానం ఎక్కడం మూర్ఖత్వం. విమానం ఎక్కి నేను క్షేమంగా గమ్యస్థానం చేరుకుంటాను అని ధీమాగా చెప్పగల విమానయాత్రికుణ్ణి యీ జగత్తులో మీరు నాకు చూపగలరా స్వామీ! నిరుడు ఢిల్లీయూర్న్ మాచెస్‌కి విమానంలో సివర్లా ప్రయాణం తగిలింది. ఎల్లాగో తప్పించుకున్నా వెళ్లకుండా. ఇంతకీ మరో ఏడాదిపాటు నూకలు మనకీ భూప్రపంచం మీద వ్రాసి పెట్టాడు పరమాత్మ. ఎందుకు వెళ్లలేదని సిమ్లా-అమ్మాయి చెప్పే వుంటుందేమోలెండి......"

"రండి-కూర్చుని, కాఫీ పుచ్చుకుని సావకాశంగా మాట్లాడుకుందాం" అని మెట్లెక్కాను. ఆయన ఆరో మెట్టు మీద నిలిచి పోయారు.

"నాకు కాఫీ అనీ, టీ అనీ పట్టింపులు లేవు. ఏదైనా పుచ్చుకుంటాను. అసలు లేకపోయినా, అయ్యో లేకపోయిందే అని ఇరవను. ఒకసారి చెరుకుపల్లి జమీందారు గారి డిన్నరిచ్చారు. 'మజ్జిగమకుని కాఫీ వొడ్డించారు."

నేను లోపలికెళ్లి ఆవిడ చెవిని ఈ వార్త పడేసి, కుర్చీలు, బల్లలు కాస్త సర్ది యివతలికొచ్చాను. ఆయన మూడో మెట్టు మీద నిలబడి మాట్లాడుతున్నాడు- మెట్ల కొంపల్ని గురించి.

"తంజావూర్లో చెట్టియార్ యింటికి వెళ్లాం...."

దీర్ఘోపన్యాసానికి తావివ్వకుండా ఎక్కడికక్కడ నిలదొక్కడం మంచిదనుకుని అడ్డు ప్రశ్నల కుపక్రమించాను.

"తంజావూరా? ఎవరెవరెళ్లారు?"

"మామగారితో-కోయంబత్తూరు నుండి కారులో వెళ్లాం. ఆ చెట్టియారింటికి నాలుగు చోట్ల మెట్లున్నాయి. మధ్య హాల్లో మామగారూ నేనూ విడిపోయాం. నేను వరండా మెట్ల మీదుగా వెళ్లాను. వాళ్లు ముందు అరుగుల మీద మెట్ల గుండా వెళ్లినట్లున్నారు. ఈ రెండు మెట్ల వరుసలూ పైన బాల్కనీలో కలిసినట్లున్నాయి-టపీమని ఆ చెట్టియారూ, నేనూ గుద్దుకున్నాం-" నవ్వడం సాగించాడు.

చెట్టియార్ ఘట్టం ముగిసినందుకు నిట్టూర్చాను. ఇంతలో లోపల్నించి ఆవిడా వొచ్చింది. చిరునవ్వుతో 'ఎవ్వరు రావడం?'

## ఇళయరాజా గురించి కొన్ని కొత్త విషయాలు

"ఇళయరాజా మేధావి," అంటారు ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. రాజేశ్వరరావు.

"హౌ టు నేమ్ ఇట్" సంగీత బృంద కేసెట్‌లో వయొలిన్‌కు "నథింగ్ బట్ విండ్"లో పిల్లనగ్రోవికి ప్రాధాన్యత ఇచ్చి స్వరాలు కూర్చిన ఇళయరాజా ఇటీవల సితార్ ప్రధానంగా ఒక జంత్ర సమ్మేళనాన్ని ధ్వని ముద్రిక చేసి, అది తనకు సంతృప్తికరంగా లేక పోయేసరికి దానిని రద్దు చేశారు.

ఈయన హేర్ కట్ చేసు కోరుగాని, జుట్టు బాగా పెరిగిపోతే అమాంతంగా గుండుచేయించుకుంటారు.

ఇంట్లో ఏ మాత్రం తీరుబడి లభించినా పియానో వాయించడం, లేకపోతే సంగీతం వినడంతోగాని కాలం గడువుతారు. పుస్తకాలు, పత్రికలు అసలు చదవరు.

పాలు కలిపిన టీకి బదులు శొంఠి-కొత్తిమీర కలిపిన పానీయాన్నే సేవిస్తారు. ఇదివరకు రొయ్యల పులుసంటే ఇష్టం. ఇప్పుడు పూర్తిగా శాకాహారి.

ఎంత ఐశ్వర్యవంతుడైనా 1978 లో కొన్న అంబాసిడర్ కారునే ఇప్పటికీ ఉపయోగిస్తున్నారు.

రీరికార్డింగ్ సమయంలో 'నోట్సు' ఇవ్వడానికి మాత్రం హార్మోనియం ఉపయోగిస్తారు. ఆ నోట్సు ఆధారంగా ఇదివరకు ఆయన సోదరుడు గంగై అమరన్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ నిర్వహించేవారు. గంగై అమరన్ డైరెక్టర్ అయి ఇటీవల నెల రోజులపాటు విదేశాలలో ఉండిపోయినప్పుడు ఖాళీగా ఉన్న సంగీత దర్శకుడు ఎం.ఎస్. విశ్వనాధన్‌కు ఆ రీరికార్డింగ్ బాధ్యతలను అప్పగించారు ఇళయరాజా. ఈయన ఒకప్పుడు ఎం.ఎస్. విశ్వనాధం ఆర్కెస్ట్రాలో వయొలిన్ వాయించేవారు. (జి.ఎ.జి.)

# రోహిణి 'వ్యాంప్'!?

గాంధీ చిత్రంలో కస్తూరిబా గాను, టి. వి. సీరియల్ "కుఛ్ ఖోయా కుఛ్ పాయా"లో వైహిసిగాను నటించిన రోహిణీ హట్టంగడి వ్యాంప్ పాత్రలు వేస్తుందంటే నమ్మశక్యమేనా? ఫోటో చూస్తుంటే నమ్మాలనే అనిపిస్తోంది కదూ! మరి మామూలు పాత్రలు దొరక్కపోతే ఎవరు మటుకు ఏం చేస్తారు?

అని అడిగింది.

ఇదొక అర్థం లేని ప్రశ్న.

"సామాన్లేవి?"

అంతబొత్తుగా అర్థంలేని ప్రశ్న కాదేమో. "నేనొచ్చి నాలుగురోజులైంది- సరిగా చెప్పాలంటే మూడున్నర రోజులు. క్లబ్బు గదుల్లో విడిది. టెన్నిస్ మాచెస్ అవుతున్నాయిగా. మా పినమామగారు పెద్ద టెన్నిస్ ఆటగాడులే- నాతో ఆడితే వో సెట్టుకి రెండు గేములు కూడా గెలవలేదు-అయినా మామగార్ల ఆట మెచ్చుకోడం తప్ప యీ అల్లుళ్లు ఏం చేయగలరు? మీరు టెన్నిస్ ఆడతారా?"

"అబ్బేలేదండి"

"సాయంత్రం ఉభయులూరండి. నా ఆట కూడా చూద్దురుగాని. మొన్న విజయనగరంలో మనవాళ్లంతా వచ్చారు. నాకు తెలుసులే. ఎందుకు నవ్వుతున్నావో. చిన్నప్పుడు ఆటలు, పాటలూ ఏవీరావు, యీ ఆట ఎల్లాగొచ్చిందా అని. ఇల్వపురం జమీందారు తమ్ముడూ, నేను స్నేహితులం. వాళ్లు జర్మనీ నుంచి ఓ కోచ్‌ను తెప్పించారు. రాత్రుళ్లు గ్యాస్ లైట్లు పెట్టుకుని ఆడే వాళ్లం."

"కాఫీ పుచ్చుకోండి......"-కాస్త చప్పరించేడు.

"సామాన్లు క్లబ్బులో పెట్టాను. మీరిక్కడున్నారని మొన్న తెలిసింది. సరే చూసిపోదామని. చుట్టాల్ని చూడకపోతే మా ఆవిడ వూరుకోదు. మా మరదలు నెల్లూర్లో వొక స్నేహితురాలింటి దగ్గర దిగిందట. నేనేమో గురవయ్య నాయుడు గారి చైర్‌మన్ ఎలక్షన్స్ సందర్భంలో నెల్లూరెళ్లాను. మరదలు పిల్ల అక్కడుందని నాకేం తెలుసు? ఆమెను చూడకుండా వచ్చినందుకు మా ఆవిడ వారం రోజులు నాతో మాట్లాడలేదు- అంటే నే యింట్లో ఆవిడతో వున్న, పది నిమిషాలూనూ నాకు ఏకాంతంగా యింట్లో వుండే ప్రాప్తి లేదంటే నమ్మండి. పనీ లేదు. తీరుబడీలేదన్న సామ్యంగా వుంది."

"మరదలుకు పెండ్లి సంబంధాలు చూస్తున్నారా?" అని అడిగింది ఆవిడ.

"ఆవిడ పెళ్లి చేసుగుంటుంది? నాకు నమ్మకం లేదు. ఆయన కట్నం దమ్మిడీ యివ్వనంటాడు. ఆ గడింపంతా ఏం చేస్తాడో, కర్మ! పీనాసని కాదు. అదొక ఆదర్శంట. మరినా కెల్లా యిచ్చాడు-కటిక సొమ్ము పది వేలు. డిన్నర్‌కి నాలుగు వేలయిందిట-గవర్నర్‌గారి ఆంతరంగిక కార్యదర్శి అతిధిగా విచ్చేశారులే. బాణసంచాకి వెయ్యి, వూరేగింపు విమానానికి ఐదొందలు-ఆరోజుల్లో-ఇవుడైతే, ఖర్చంతా వో యాభై వేలవును. మాకొచ్చిన పెళ్లి బహుమతులు వో ఐదారు వేలుంటాయి. కట్నాల ద్వారా సగం ఖర్చు రాబట్టాడనుకో- నువ్వొచ్చావుగా-నీకింకా అప్పటికి పెళ్లి కాలేదుగా. కట్నాలు పుచ్చుగోడం మనబోటి చదువుకున్న వాళ్లది పొరబాటే-కాదన్ను. కాని సంఘంలో ఓ ఆచారం వున్న తరువాత పాటించక తప్పుతుందా? సరే సరోజకి ఎంతసేపూ చదువు, సంగీతం-సినిమాలు, షికార్లు, పిక్‌నిక్‌లు, పెళ్లి చేసుకోవాలన్న ఉద్దేశమే లేదు. ఏ మాట కామాటే చెప్పాలి-మా ఆవిడ ఎంత చదువుకున్నదైనా, పూర్వకాలపు మనిషే అనాలి. కాస్తంత దైవభక్తి, పూజ పునస్కారం, యాత్ర, కొలువు-కలెక్టర్‌గారు వారి హయాంలో చేసిన దుండగాలు, దురంతాలకి పరిహారార్థం పురాణ కాలక్షేపం, గీతా పారాయణం, ఆదివారం జరిపించి, పండితుల్ని సత్కరించే ఆచారం వుండబట్టే, అమ్మాయికి యిదంతా అబ్బిందనుకో. మనం తప్పించుకున్నాం. సరోజకివి గిట్టవు. నాకుమల్లే. అందుకనే లోలోపల నేనంటే యిష్టం అనుకుంటా."

"నువ్వు వంట విషయం చూడు" అన్నాను ఆవిడ నుద్దేశించి.

"నా కోసం వంట చెయ్యకండి. క్లబ్బులో డిన్నరుంది. కబుర్లు చెప్పగుందాం. మీరు వొంటకెవర్నైనా పెట్టుగోండి. లేకపోతే ఇదే చిక్కు. ఇంటికెవరేనా వస్తే వారితో మాట్లాడే అవకాశం వుండదు. ఓ సారి కేరళ సబ్ కలెక్టరు-మళయాళీ భార్యా సమేతంగా గుంటూరొచ్చాడు. అత్తగారు వొంటకనీ, అమ్మాయి కాఫీ కని లోపలికెళ్లారు, పనిమనిషి పేరమ్మను వొప్పజెప్పి. ఆవిడకి కాలక్షేపం ఎల్లా జరుగుతుంది? పేరమ్మ ఏం మాట్లాడుతుంది? బుచ్చమ్మలా గుడ్లప్పగించి అల్లా చూస్తూ నిలబడింది. పేరమ్మ పేషన్‌గా వుంటుందిలే. ఇదుగో ఈ సినిమాలొచ్చిం తర్వాత అది మరీ సినిమా స్టార్‌లా తయారైంది. మా ఆవిడా, సరోజ ఇచ్చిన జాకెట్లే వుంటాయి వో డజను. వీళ్లకి సైజు కుదరక దానికి బహూకరిస్తుంటారులే. దాన్ని చూసి సరోజ అనుకుంది కాబోలు- ఇంగ్లీషులో సంభాషణ సాగించింది ఆవిడ. ఇదేమో నవ్విందట. మళ్లా ఆవిడ ఇంగ్లీషులో ఏదో అడిగిందట. పేరమ్మ లోపలికెళ్లి చీపురు తీసుకొచ్చిందట వూడుద్దామనుకుని. ఆవిడ కోపంతో చరచరా నడుచుకుంటూ బైటకెళ్లి, మామగారి డ్రైవర్ని పిలిపించి, కారులో ట్రావెలర్ బంగళాకెళ్లిపోవడం- మామగారు పేరమ్మని మానిపిస్తానని బెదిరించడం, అది లబోదిబోమని ఏడవడం- నేవెళ్ళి సర్దుబాటుచేసి, వో వంట లక్కని కుదర్చడం, వొచ్చిన అతిథుల్ని ఎల్లా వినోద పరచాలో తెలియచెప్పడం- వారి కుటుంబ చరిత్రలో వొక అపూర్వ ఘటం......"

"కాసేపు నే అల్లా వెళ్లొస్తాను. మీరు

పత్రిక చూస్తూ వుండండి" అన్నాను. ప్రశ్నార్థకంగా చూశాడు ముకుందం.

"సినిమాకా?"

ఎట్లా కనుక్కున్నాడో చిత్రం! అసలు నిజంగా సినిమాకనే బైలుదేరాను. కాస్తంత అబద్ధం ఆడాను.

"డాక్టర్ మాధవయ్యగారింట్లోంచి టెలిఫోన్ చేసి, రాత్రికి ఏం ఆటాడుతున్నారో కనుక్కొనొద్దామని బెలుదేరాను" అన్నాను.

"అయినా, అమ్మాయి లేకుండా మీరొక్కరూ సినిమాకెళ్లడం భావ్యమా చెప్పండి? మా కళ్యాణి వూరుకోదు. నేను వాళ్లింట్లో వుంటే ఎక్కడికెళ్లినా ఇద్దరం కలిసెళ్లాల్సిందే....."

"ఆమెను కూడా ఇప్పుడు మీతో తీసుకురాలేదేం?" అన్నాను.

"ఆవిడకి ఆటలు చూడ్డం అంటే విసుగు. లెక్చర్లు, క్లబ్బులు, పార్టీలు ఇవేవీ గిట్టవు. నాకివి లేకపోతే గడవదు. మల్లా సరోజ అల్లాకాదు...."

ఆయనింకా మాట్లాడుతూనే వున్నాడు. నేను బైటికి నడిచాను. వెడుతూ మా పనివాడు ముసలయ్యని అయ్యగారికి ఏం కావాలో కనుక్కుంటూ వుండమని చెప్పి వెళ్లాను. ఓ గంటలో తిరిగొచ్చాను. ఆయన ముసలయ్యతో మాట్లాడుతున్నాడు. ముసలయ్య వింటూన్నట్లు లేదు. గోడకి జేర్లబడి కునుకుపాటు పడుతున్నాడు.

"పోరంబోకు పొలం వో ఎకరం నాకప్పచెప్పు. రెండేళ్లల్లో బంగారం పండిస్తాను. మామగారిదో రెండెకరం బీడుంది. జిల్లా వ్యవసాయాధికారి నా స్నేహితుడులే. అతని సలహా మీద కావల్సిన ఎరువు అదీ వేశాను. ఇవాళ పదివేలిచ్చి కళ్లు మూసికొంటామని ఎగ

# కాలచక్రం నిలిచింది

బడుతున్నారు. నువ్వు రాత్రి పొలం కాడుంటావా?"

"మాటాడవేం ముసలయ్యా నిన్నే అయ్యగారేవో అడుగుతున్నారు."

"అంతే నెగండి" అని దూరంగా వెళ్లి చుట్టముట్టించే తతంగం జరుపుతున్నాడు.

"ముసలయ్య మా మామగారి పొలం కాపు. కాస్త సాయ్యంగా వుంటాడు. ఇపుడు పొలం పనులేవీ లేవని, ఇక్కడికి పంపించారు" అన్నాను.

"పొలంలో పాముని చూసి జడుసుకునే ఘటంలా వున్నాడు. పాముని పట్టడం నేర్చేస్తేగాని, ఎవరికీ పొలంలో పనిచేసే అధికారం లేదంటాను. ఓ సారి రావులపాడులో సాయంత్రం చేలల్లోంచి వొస్తున్నాం. కాలికేదో మెత్తగా తగిలింది. నేను గమనించలా.

రాత్రి వెన్నెట్లో భోజనాలకి కూర్చున్నాం.

రెంయ్యిమని నా విస్తరి ముందుగా వొచ్చి పడగెత్తింది. అందరూ అదిరిపోయ్యారు.

మీరెవ్వరూ భయపడకండి. నా కోసం వచ్చింది అన్నాను. కిమిన్నాస్తి. కరణంగారి భుజంపైన సిల్కు కండువా తీసి చటుక్కున గివాటెట్టా. దాన్ని కరిచేసి అందులో ఇరుక్కుపోయి, లుంగ చుట్టుకు పోయింది. మరోసారి మైలవరం రాజుగారింట్లో...."

"విను ముసలయ్యా!" అని వో కేకేసి స్నానానికెళ్లాను. వొచ్చాను. ఆయన ముసలయ్యతో ఏదో చెప్పగుంటూ పోతున్నాడు. పులివేట విషయం.

"చెప్పండి, చెప్పండి" అంటూ కుర్చీలో కూర్చుని పత్రిక చదువుకొంటున్నాను.

నాకెన్నాళ్లనుంచో పులిని దగ్గరగా వో ఫోటో తియ్యాలని మనసు. అయ్యాపురం జమీందారు బావగారొకాయన వొచ్చాడు. నలుగురైదుగురం అడవిలోకి ప్రయాణం కట్టాం. మేకని ఎరగా కట్టి వెళ్లిక్కాం.

రెండు గంటల వరకూ నిశ్శబ్దం. తరువాత కోతులు కిచ కిచ లాడాయి...... దూరంగా గర్జింపు వినబడింది. నే కూర్చున్న చోటునుండి మేక కనబడటం లేదు. ఎప్పుడొచ్చిందో ఎప్పుడెళ్లిందో మేక అరుపు నిలిచిపోయింది. మరో గంటకి దిగి మెల్లిగా నడచిపొయ్యాం. ఒక మైలు వెళ్లిం తర్వాత మేక కళేబరంలో తినగా మిగిలిన భాగాలు ఆకులతో కప్పబడి వున్నాయి. దాని చుట్టూ వొక వల అల్లి, అల్లిక తాళ్లని కెమారాక్లిక్కి ముడేసి, కెమెరా దూరంగా పొదలో వుంచాం. పులి వొస్తుంది. వల మీద కాలు పెడుతుంది. క్లిక్ మంటుంది. ఫోటో పడిపోతుంది. అదీ ఏర్పాటు. ఇంతలో ఏదో చప్పుడైంది. నాతో వున్న వాళ్లు చెట్టెక్కేశారు. వెనక్కి తిరిగితిని కదా, అర ఫర్లాంగు దూరంలో నాకేసి వొస్తోంది పెద్దపులి....."

"భోజనానికి లేవండి....."

అంది మా ఆవిడ. ముకుందం కథలో లీనమైపోయి, వినిపించుకున్నట్లు లేదు.

"అప్పుడేం చేశానని మీ వూహ? కదలకుండా, వూపిరి బిగబెట్టి, పులి కళ్లలోకి చూస్తూ స్తంభించి పోయాను. అది కూడా అల్లానే, నిర్ఘాంతపడి నా మొహంలోకి చూస్తూ నిలబడిపోయింది. చూపు తప్పించకుండా, మెల్లగా వొక్కొక్క అడుగే వెనక్కి వేసుగుంటూ, వో ఫర్లాంగు వొచ్చేశాను. అది విసుగెత్తి పారిపోయింది....."

"భోజనానికి......"

"ఆ నాడు నేను కదిలివుంటే పులికి భోజనం దొరికి వుండును. నువ్వీ నాడు నాకు భోజనం పెట్టే అవకాశమే లేకపోను...."

ఓ హో! హో! హో! అంటూ ముకుందం దీర్ఘంగా నవ్వి, ఆ కూర్చీలోంచి లేచి పడక్కుర్చీలో కాళ్లు జాచి విశాలంగా పడుకున్నాడు.

పన్నెండున్నర దాటింది. నాకాకలిగా వుంది. పుట్టంతా మునిగిపోయినట్లు ఆయన్ని వో ప్రశ్న అడిగాను.

"ఏమండీ- వేటకి వెళ్లినపుడు, తుపాకులూ అవీ తీసుకెడతారు గదా. మరి పెద్దపులి మీదకి వొస్తున్నప్పుడు తుపాకీ పేల్చలేకపోయారా?"

ముకుందం గారికి చాలా కోపం వచ్చింది. ఆయన దగ్గర తుపాకీ వుండి వుంటే ఆ క్షణంలో నన్ను పేల్చేసి వుండును ఆ ప్రశ్న అడిగినందుకు.



"ఇంకా నయం- మీకు ప్రతి విషయం, తుపాకీ విషయం బొత్తుగా తెలీదనుకుంటా. తుపాకీ సరైన పొజిషన్‌లోకి తీసుకురావడా నికి కొంత చేతుల కదలిక అవసరం. ఏ మాత్రం కదలిక జరిగినా, వెంటనే వచ్చి మీదపడి చంపేస్తుంది పులి. అంచేత దాని కళ్లల్లోకి చూస్తే అది భయపడి పారిపోతుంది. అట్లాంటి సందర్భాలలో మన తెలివి పనిచె య్యదు. శరీరం బుద్ధికి తెలియకుండా, తన జాగ్రత్త అది పడుతుంది. ఓ సారి అరవిందుని ఆశ్రమానికెళ్లాం- కళేబర స్వామితో.

రాత్రి విడిదిలో మంచాలున్నాయి పక్క లేసి సిద్ధంగా. స్వామీజీ పొట్టి కింద సంచీ దిండుగా పెట్టుగుని పరున్నాడు. మంచం మీదికి రండి అన్నాను. వొద్దు అందరం కిందే పడుకుందాం అన్నాడు. ఆయన మాట తీసెయ్యలేక, అల్లాగే పడుకున్నాం. ప్రొద్దున్నే అక్కడ వాళ్లొచ్చి మంచం సర్దారు. జానెడు పొడుగు జెర్రి, దిండు క్రింద విశ్రమిస్తోంది. అంటే ఏం జరిగిందన్న మాట. మంచం మీద అపాయం వుందిస్మా అని ఆయన శరీరం పసికట్టిందన్నమాట- పంచేంద్రియాలు కాక- ఆరోశక్తి అన్నమాట. అరవిందుడు వ్రాశాడు కూడాను- ఒక యోగి హిమాలయ పర్వతాలలో తపస్సుచేసి ఆత్మశుద్ధి సాధించి నందువల్ల లోకానికేం వుపయోగం అని వొక దొరగారు ప్రశ్నించారట. అప్పుడు ఆయన అన్నాడుట......"

"చాలా పొద్దోయింది. మీ కోసం క్లబ్బులో అందరూ కనిపెట్టుకుంటారేమో" అన్నాను.

"నా కోసం ఎవ్వరూ కనిపెట్టుకోరు. ఓ ఐదు నిమిషాలు చూస్తారు- హాయిగా తింటారు, ఎవరాకలి వారిది......"

"మరి మీ కాకలిగా లేదా?"

"ఆ ప్రశ్నకి సమాధానం మా కళ్యాణే చెప్పాలి. ఓ సారి ఆమే నేను, వాళ్ల చుట్టాలింటికి పెళ్లికెళ్లాం......"

నాకాకలేస్తోందండి- మీరూ లేవండి- భోజనాల దగ్గర మాట్లాడుకుందాం అన్నాను. ముకుందం మాట్లాడుతూనే వున్నాడు. నేను భోజనానికి లేచి ఆయన్ని కుర్చీలోంచి లేవదీ యబొయ్యాను.

"కొందరిలా నాకు వేళకు భోజనం అనే పట్టింపు లేదు. అప్పుడప్పుడూ భోజనం మానెయ్యడం మామూలే- మీరు కూర్చుని కానివ్వండి. ఏం? ఎంతవరకూ చెప్పాను! ఆ- కళ్యాణీ నేనూ వెళ్లాం. వొడ్డించారు...."

"వొడ్డించాను. లేవండి- " అన్నది ఆవిడ.

"మీరిద్దరూ కూర్చుని తింటుంటే చూడాలని వుంది. కూర్చోండి."

వొంటిగంటన్నరైంది. మేం లేచాం. తాంబూలం వేసుగున్నా, ఆయన కాస్త మజ్జిగ మాత్రం పుచ్చుగున్నాడు. మైసూ రులో తాంబూలాన్ని గురించి చెప్పడం మొద లెట్టాడు. నాకు నిద్రోస్తోంది. ఆదివారంలో గంట నిద్రించడం నాకలవాటు. ఆవులిం చాను. కాసేపు విశ్రమిస్తారా- అని స్వగ తంగా అడిగి, గదిలో పక్క సర్దాను. మైసూరు దసరావుత్సవాలని వర్ణిస్తున్నాడు.

"ఇల్లా వుపవాసాలుంటే మీరు నీరసించి పోరు? ఆకలితో కబుర్లేం చెప్పగలరు?" అని తెగించి అడిగేశాను.

"ఆ ప్రశ్నే మా కల్యాణీ అడుగుతుంది. చాలా మందికి నిద్ర, తిండి అవసరం. నాక వంత ముఖ్యం కావు. ఓ సారి రాజారావు గారింట్లో పేకాటకి కూర్చున్నాం....."

ఇంతలో నీళ్లల్లో మునిగిపోతున్న వాడికి తాడు దొరికినట్లు, పక్కింటి కుటుంబరావు, పత్రిక తీసుకెడదామని వచ్చాడు. వొకర్ని వొకరికి పరిచయం చేశాను. కుటుంబరావు స్కూలు మేష్టరు. ముకుందంగారు వెంటనే ఆయన చదువు, మేష్టర్లు, పరీక్ష అనుభవాలు చెప్పడం లంకించుకున్నాడు. అమాయకుడు కుటుంబరావు ఆ యింద్రజాలంలో చిక్కు కున్నాడు. నే వెళ్లి వెన్నువాల్చాను.

లేచేటప్పటికి మూడుకావస్తోంది. కుటుం బరావు లేడు. మా ఆవిడుంది. సరోజ చదువు విషయం చెబుతున్నాడు.

"స్త్రీల ముందు అనకూడదుగాని, పురు షుణ్ణి ఘనకార్యాలకి ప్రేరేపించేది స్త్రీలే- ఆ స్త్రీలే ఆ ఘనకార్యం కాస్తా సాధించనీకుండా ఆటంక పరుస్తారు. లాకాలేజీలో సుశీల అని వుండేది. ఆమె మెప్పుగోసం మలయప్పన్ అనే మళయాళీ సోదరుడు బాగా చదివి యూనివర్శిటీ ఫస్టుగా ప్యాసయ్యాడు. ఎమ్. ఎల్. డిగ్రీ తెచ్చుకున్నాడు. వారిద్దరూ వివాహం చేసుకున్నారు. అంతే- అతన్ని కోర్టు కెళ్లనివ్వదు- ఇరవైనాలుగ్గంటలూ తనని చూస్తూ, మెచ్చుగుంటూ, వినోదించమం టుంది. ఏమైందని మీ ఊహ- ఆరునెలల్లో ఆమెని విడిచి పెట్టాడు....."

నవ్వడం సాగించాడు. ఆవిడను కాఫీ విషయం చూడమని లోపలికి పంపించాను.

"మీరు మొహం కడుక్కోండి. కాఫీ తాగి అల్లా బైలుదేరుదాం. మీ క్లబ్బులో ఆటలకి టైమవుతుందేమో" అన్నాను.

"నేను మాచెస్‌లో ఆడటం అనేది దైవా ధీనం. వాళ్లకీ తెలుసు. అందుచేత నాకు ప్రతిగా మరో ఆటగాడు లేకుండా నన్ను పంపించరు. ఓ సారిల్లాగే ఊటీ వెళ్లాం....."

నా గుండె రాయిపడింది. ఈ లెక్కని, బెటకెళ్లడానిక్కాని, మరో పనిచూసుకోడాని క్కాని వీల్లేదు. ఏం చెయ్యను?

వారి నా విరంగా భంగ పర్చడం భావ్యం

## జూహీ ప్రతిజ్ఞ

పెద్ద చిత్రాల్లో చిన్నపాత్రలు ససేమిరా చేయనంటోంది జూహీచావ్లా. చేయనని చెప్పటం కాదు ప్రతినబూనింది. 'చాంద్‌నీ' చిత్రంలో నిర్మాత తనకు డబ్బు చెల్లించలేదుట అదేనేమో జూహీ కోపానికీ, ప్రతిజ్ఞకు కారణమని పరిశ్రమలోని వాళ్ళు చెప్తున్నారు. ఇలా మంకు పట్టుపడితే ముందు ముందు ఛాన్సులు రావేమో!

కాదు. పదండి నేనూ వొస్తాను. మీ ఆట చూళ్లేదు" అన్నాను.

"నా ఆట ఇప్పుడేముంది, యీపూట చూడకపోవటమే మంచిది. నే ఆడకపోవటం నాకూ మంచిదే. అదుగో ఆ రాజమండ్రిలో చెయ్యి, కాలు ఒకేసారి బెణికాయి. డాక్టర్ నెల వరకు కదల్చకపోవడం మంచిదన్నాడు- నాకు వీలు పడుతుంతా? వీళ్లు నువ్వొస్తే కాని వల్లకాదని చంపుకు తింటారు. కాళ్లూ, చేతులూ, మెదణ్ణే పని చెయ్యనియ్యవు. ఆఖరికి బ్రిడ్జి కూడా ఇవాళ ఆడలేను."

"పోనీ మనం వెళ్లి చూస్తూ వాళ్లకి హుషారిద్దాం" లాభం లేకపోయింది. పరమశివన్ అనే తమిళ సోదరుడి వృత్తాంతం చెబుతున్నాడు. నేనిప్పుడంతా ఏకరువు పెడతానని భయపడకండి- అది నా తరం కాదు. ఆ పూట ఆయన మా యింట్లో వుండగా మాట్లాడినవన్నీ పూరాగారాయాలంటే సవాలక్ష గ్రంథ మవుతుంది. నేనే కాదు- ఎవ్వరికీ అది సాధ్యం కాదు. ఆయన వొక ఏడాదిలో మాట్లాడిన వాటిని వ్రాయాలంటే, వో డజను మంది చిత్రగుప్తులు, తమ అసిస్టెంట్లతో, ఐదారు సంవత్సరాలు కృషి చేస్తే సాధ్యపడుతుందేమో- అదేనా షార్టుహాండులో వ్రాయడం వారికి వొచ్చుంటే మాట. ముకుందం సన్నగా పొట్టిగా వుంటాడు. గిరజాల జుట్టు, చామనచాయ, గడ్డంకింద మచ్చ, కళైన మొహం. కంఠం సన్నంగా వుంటుంది. స్ఫుటంగా ప్రతి అక్షరం సాగదీస్తూ నోరారా ఉచ్చరిస్తాడు. అతనొక ధ్వని ప్రచారక యంత్రం. ఒక భాషా సంస్థ. కాలం నిల్చిపోనట్లు, గోళాల పరిభ్రమణం ఆగిపోనట్లు, ఆయనలో ఉద్భవమయ్యే ధ్వని పరంపరలకి విరామం లేదు. అడ్డు ప్రశ్నలు, ఊ గొట్టడాలు, ఆయన కక్కరలేదు. వింటున్నట్లు తల వంకించడంతో నిమిత్తం లేదు. మనం చూస్తున్నప్పుడే సూర్యుడు కాంతికిరణాలను ప్రచారం చేస్తున్నాడా? మనం కోరినప్పుడే నిండు చంద్రుడు దర్శన మిస్తున్నాడా? ప్రియురాలొచ్చే వరకూ ఆగమంటే పువ్వు పరిమళించడం మానుకుంటుందా? నిద్ర

## కాలచక్రం నిలిచింది

పోయిన కాసేపు, మౌనంగా వుంటాడనుకుంటున్నారా? అది భ్రమ. మేఘం వెనకాల సూర్యుడు వెలుగుతూ వుంటాడు. మనకి కనబడడు. శిఖరం వెనుక చందమామ మనకి కనబడకపోవచ్చు. అంత మాత్రం చేత లేడంటామా? ఎడారిలో వాడిన పువ్వు, సంద్రాల లోతుల్లో ధగ ధగ మెరిసే వజ్రం- మనకేం తెలుసు. మనం ఎంత అల్పులం? ఎక్స్‌రే యంత్రాన్ని ప్రయోగించి నిద్రిస్తుండగా ఆయన మెదడును పరికించండి. ఒక మహా కావ్యం అల్లుతూ వుంటుంది ఆ మెదడు. మెదడులో ధ్వని కదలికని వ్రాసే పరికరాన్ని యే శాస్త్రజ్ఞుడో ముందు ముందు తయారు చేసి తీరుతాడు. అప్పుడింక ఆధునిక యుగంలో మహా కావ్యాల లోపం వుండదు.

ఆరు కోవస్తోంది. ముకుందం గారు స్వీయగాథలో పడ్డారు. తనని భార్య కల్యాణి ఏ విధంగా ప్రేమించి వెళ్లి చేసుకున్నదీ- పొరబాటు- ఏ విధంగా వెళ్లి చేసుకున్న తర్వాత, ప్రేమించడం మొదలెట్టిందీ, అదే శాశ్వతమైన ప్రేమ- ప్రేమంటే ఏమిటి? ఒక అరగంట లెక్చరిచ్చాడు. సొమ్మసిల్లి పొయ్యాను. ప్రేమలో వైరాగ్యానికి తావుందా? పవిత్రమైన ప్రేమ యీ యంత్రయుగంలో సాధ్యమా? మార్క్సు సిద్ధాంతాలకి ప్రేమకి వున్న సంబంధం ఏమిటి? ప్లేటో ఏమన్నాడు.వేమన్న పద్యం చూడండి. వాల్మీకి రామాయణం తీసుకోండి. పోతన భాగవతం తియ్యండి. అమెరికా విడాకుల తఫసీళ్లు- మాస్కోలో విడాకుల సంఖ్య- సంతాన నిరోధం ఆవశ్యకత- పెరిగిపోతున్న జనాభా- మన దేశంలో మూఢాచారాలు.

"నాకు పిల్లలు లేరు. వుండరు కూడా. వుంటే, నా జీవితంలో వున్న ఆనందం వారికి సాధ్యం కాదు. ఆస్తి పంచుకుంటారు. ప్రేమ పంచుకుంటారు. సంతోషం పంచుకుంటారు. వారికి సంతానం కలుగుతుందిగా! నేను తాతనవుతాను. కల్యాణి అమ్మమ్మవుతుంది. వారి సంతానం బలహీనులవుతారు. ఆస్తి సన్నగిల్లి పోతుంది. వారి సంతానానికి తినేటందుకు తిండే వుండదు. సంఘ పతనం..."

ఆయన సంతానం కూడా ఆయనలాగే తయారవుతే, యింకేమన్నావుంది? వూహించలేకపొయ్యాను.

"నా సంతానం మూగవాళ్లవుతారు- అమ్మ పోలికే అయితే- ఎందుకంటారా? కల్యాణి అంతనాలా మాటకారి కాదు. ఆవిడ కంఠం మాధుర్యం. వొక అపూర్వ అనుభవం..."

ఏడు కావస్తూంది. ఏమిటి చెయ్యడం? ఆవిడ కాస్తంత టీ, దోసెలు తెచ్చింది. ఆయన దోసెలు తిన్నాడు. నా పళ్లెంలోనివి కూడా దగ్గిరికి లాక్కుని కబుర్లు చెబుతూ తినేశాడు. టీ త్రాగాం. ఇంతలో దైవం కటాక్షించాడు. ఫైరింజన్ మా గుమ్మం ముందు నించీ చప్పుడు చేస్తూ వెళ్లింది. ఎక్కడో ఇళ్లు తగలడుతున్నాయంటూ ముసలయ్య వచ్చాడు. "రండి చూసొద్దాం" అంటూ ఆయన్ని లేవదీసి మెట్లకిందికి నడిపించాను. వెనక అహోబలరావుగారిల్లు తగులబడిన చరిత్ర చెబుతున్నాడు. నడుచుకుంటూ వెళ్లాం. క్లబ్బుకు కొంచెం దగ్గరలోనే గుడిసెలు తగలడుతున్నాయి. క్లబ్బులో వాళ్లు కూడా చూడ్డానికొచ్చారు. ఆ ఎరుగున్న వాళ్ల గుంపులో కలిసిపొయ్యాడు. మళ్లా రాత్రి కనిపిస్తా అన్నాడు. తప్పకుండా అన్నాను. ఆ క్లబ్బు మిత్రుల్ని పట్టుకున్నాడు. అంతా ఆ ప్రవాహంలో కొట్టుకుపొయ్యారు. నే యింటికొచ్చేశాను.

ముకుందాన్ని మళ్లా మూడేళ్ల తర్వాత కలుసుకున్నాను. ఆ రోజుల్లో పెద్ద గాలీ వానా వొచ్చి, రైళ్లు నిలిచిపోవడం జరిగింది. రైళ్లు తిన్నగా లేవని మా ఆవిడ పుట్టింట్లో వుండిపోయింది. కారియర్ భోజనం తప్పింది కాదు.

సాయంత్రం ఆరైంది. రైళ్ల విషయం

కేవలం రు.100/-లకే
ట్రాన్సిష్టర్‌తోపాటు టేప్‌రికార్డర్

3బ్యాండ్ల,అత్యంత ఆకర్షణీయమైన సుందరమైన నేషనల్ పేన సోనికంపెనీ యొక్క ట్రానిస్టర్‌తో పాటు 5సం. గ్యారంటీతో టేప్ రికార్డర్ కేవలం రు.100/-లకే మా స్కీము ద్వారా పొందగలరు. తపాలా ఖర్చులు అదనం.

Kailash Trading Co, (AT)
P O. Lal Bigha (Gaya)

'ఉత్తరాలు' శీర్షికకి రాసేవారు

తమపేరు, పూర్తి చిరునామా తెలుగు లిపిలో రాయాలని మనవి చేస్తున్నాము.

-సంపాదకుడు.

పిల్లల సచిత్ర
మాసపత్రిక
బాలరంజని
చదవండి!
ఆంధ్రపత్రిక ప్రచురణ!!

కనుక్కుందామని బయలు దేరుతుండగా మెట్ల మధ్యలో ముకుందం ఢీ కొన్నాడు. ఏడాది క్రితం ముకుందం భార్య టైఫాయిడ్ జ్వరం వచ్చి చనిపోయింది. సానుభూతి జాబు వ్రాశాను. కలునుగోడం యిదే మొదటి సారి, పరామర్శకి వాక్యాలు కూరుస్తుండగా, ముకుందం వాటిని వుచ్చరించే అవకాశం యివ్వకుండా తానే సాగించాడు.

"ఈ రోజుల్లో రైళ్లు మరీ అధ్వాన్నమయ్యాయనుకో. ఆలస్యంగా రావడానికి, నిలిచి పోడానికి యీ తుఫాను వోసాకు. వుత్తప్పుడు ప్రతి రైలు వో రోజు ఆలస్యం. తుఫానొస్తే వో వారం. అంతే తేడా. గుంటూరు నుంచి బండి దిగాను. ఎక్స్‌ప్రెస్ పదిగంటలు లేటు. సరే ఆ ప్లాట్ ఫారంలో యిరుక్కుని యే జబ్బో తగిలించుకోడం ఎందుకని, మిమ్మల్ని చూసి పోదామని వొచ్చాను. అర్జంటుగా ఢిల్లీ వెళ్లాలి."

"మా వూళ్లో రైతులంతా- భూముల్ని గురించి వో కొత్త శాసనం వొస్తోందిగా- దానిలో తికమకలు చాలా వున్నాయిలే. వారికున్న అభ్యంతరాలని వో పిటిషన్ ద్వారా, ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి విన్నవించమని, ఆ పిటిషన్ వ్రాయించి, ఆ నాయకత్వం నామీద పడేశారు. ఇట్లాంటివి చాలా చేశానులే. వెనక గుర్నాధం గారి ఇంటి తగాదా- ఢిల్లీకి తీసుకెళ్లాను. ఇళ్లశాఖ వారు నే ఎత్తిన లాపాయింట్లకి ఖిన్నులై, సుప్రీమ్ ప్రథమ స్థానం వహించినందుకు ఆశ్చర్యపడ్డారు. మన కెక్కడ తిరుతుంది. అయినా, కల్యాణి పోయిం తర్వాత, నా పాత వ్యాపకాలన్నీ మానుకున్నాను. జీవితం పట్ల నా దృష్టే మారిపోయింది. నేనిప్పుడేవీ పట్టించుకోడం లేదు. ఇప్పుడు గూడా ఆ రైతులంతా చంపుకుతింటే, సరే, పరోపకారార్థం యీ శరీరం అన్న సామ్యంగా, ఊఁ అన్నాను. ఇంక వో విషయం నెత్తిన వేసుకున్న తర్వాత, దానంతు తేల్చేవరకూ వూరుకోనని నీకు తెలుసుగా!"

"పాపం కల్యాణి..."

"ఏం పాపం. పుట్టిం తర్వాత చావు తప్పదు కదా. అన్నిమంచి లక్షణాలుండి, వొక ఆదర్శప్రాయమైన వ్యక్తిగా, నలుగురికీ కన్నెర్రగా వున్న కల్యాణి చాలాకాలం బ్రతకదని లోలోపల అనిపించేదిస్మా! అంత మంచిగా వుండగూడదనుకో- యీ ప్రపంచంలో దేవుళ్లు వోర్చలేరుట. గ్రీకు పురాణ గాధలు...."

"రండి లోపలికెడదాం...."

"ఎవ్వళ్లం టైఫాయిడ్ అనుకోలేదు. అరడజనుమంది స్పెషలిస్టుల వూమకున్న రోగి ఆయువు మూడినట్లే. ఇరవై రోజులయ్యాక వలానా అని నిర్ణయించారు. కాంప్లికేషన్ వుందేమో చూడండన్నా- నా మాట పెడచెవిని పెట్టారు. ఆమెకు తెలుసు బ్రతకనవి. నన్ను దగ్గరకు రమ్మంది. మంచం బద్దీ మీద కూర్చున్నాను. నా రెండు చేతులూ పట్టుకుంది. ఆమె కళ్లు చాలా పెద్దవిలే. నీరసించిందేమో- మరీ పెద్దవిగా కనిపించాయి. కన్నీరుతో 'మీరు సరోజను చేసుకోండి' అంది. నాకు ఏడుపులో నవ్వొచ్చింది.

చనిపొయ్యేవారికి బ్రతుకున్నవారంటే అంత తాపత్రయం వుంటుంది కాబోలు."

"రండి..."

లోపలికెందుకు- బయిటికెళ్లి టీ తాగొద్దాం. యీ ఆడాళ్లున్నారే- భలే అసాధ్యులబ్బాయ్. వాళ్లకి కొన్ని విషయాల్లో దూర దృష్టి వుంది. ఏకాంతంగా మొగాళ్లు పొయ్యే పోకిళ్లు, వేసే వేషాలు, యిట్టే పసిగట్టేస్తారు. వాళ్లింటి

పక్కన మోహనరావని వుండేవాడు. గౌరవమైన కుటుంబీకుడు. వాళ్లింట్లో పనిచేసే పిల్ల వోసారి కల్యాణితో అన్నదిట. ఏదో మాటల సందర్భంలో "అమ్మగోరు చాలా మంచివారండి" అమ్మగోరంటే మోహనరావు సతీమణి అన్నమాట. ఆ రాత్రి కల్యాణి నాతో అంది-ఏమందో తెలునా? "ఆ పని పిల్లకి ఆరోమాసం-తండ్రి మోహనరావు ఆ పని పిల్లని తీసుకెళ్లి పొయ్యాడు. ఎందుకు చెప్పొచ్చానంటే కల్యాణి విషయం యిట్టే గ్రహించింది."

"ఇటు రండి-రోడ్డు నడుంగా లారీలు ఆవీను" అని ఆయన్ని పక్కగా లాగాను. హోటలికెళ్లాం"

సరోజ పెళ్లంటే ఇష్టంలేనట్లు, మొగాడంటే గిట్టనట్లు నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తుందా - అదంతా నటనేననుకో. నన్ను తెగ వేళాకోళం చేసేదిలే. సరోజ వాళ్ల అక్కంత చక్కంది కాదు. కాని అంతకంటే గడసరి - నేనో ఉత్త అమాయకుణ్ణి. మా ఆవిడన్నట్లు సరోజని గురించి నాకే ఇతర అభిప్రాయం అప్పుడూ లేదు, ఇప్పుడూ లేదు. కల్యాణిని తృప్తిపరచటం కోసం సరేలే అని వాగ్దానపూర్వకంగా అన్నాను. కాని నాకు నిజంగా ఆమెను చేసుకోవాలని లేదు. ఎందుకంటావా, మనది బిజీ లైఫ్. పెండ్లికో, ప్రేమకో టైమ్ లేదు. ఈ ఆడాళ్లున్నారే - మన జీవితం అంతా వారి సమక్షాన, వారి ఆరాధనలో గడపమంటారు. నాకది సాధ్యం కాదు. సరోజ తల్లికూడా ఆమెను చేసుకోమని చాలామంది చేత చెప్పించింది. ఆఖరికి ఏమందో తెలుసా?

టీ త్రాగి మళ్లా ఇంటివైపు బయలు దేరాం. అతను మాట్లాడుతూనే ఉన్నాడు. నా ఆలోచనలు నేను వేరే సాగిస్తున్నాను. ముకుందానికి వస్తుసేకరణలో పక్షపాతం లేదు. అతనికన్ని వస్తువులూ, ఉదంతాలూ, వ్యక్తులూ సమానమే. అన్నీ అతని వాగ్దేవిని సమంగా పురికొల్పి, సమమైన శీవితో ధ్వనులను ప్రసారం చేస్తాయి. భార్య మరణం, సరోజ పెళ్లి, గుర్నాధంగారి ఇల్లు, హాకీ ఆటలో రంగయ్యనాయుడు వోటమి, క్రిల్లీలో సున్నం ఎక్కువ అవటం ఇవన్నీ అతనికి మహాకావ్యాలే. ఎక్కువ తక్కువలు లేకుండా వేదాంతిలా నిశ్చల మనస్కుడై వితర్కిస్తాడు. మౌనం యోగి తపస్సు. భాష, ధ్వని ఇతని తపస్సు. ఊహ ద్వారా ఒక ప్రపంచాన్ని శాసించాడు. ఆ జగత్తుకి అతని చక్రవర్తి. మనం అంతా అతనికి ప్రజలం. రాజుగారు మాట్లాడేటప్పుడు అందరూ నిశ్శబ్దంగా వుండాలి.

అతను చవి చూడని అనుభవం లేదు. లోనుగాని ఉద్రేకం లేదు. జయించని తృష్ణ లేదు; తరచి చూడని రహస్యానుభవం లేదు; కనని కల లేదు; ఆడని అబద్ధం లేదు. తెలియని సత్యం లేదు. రాజ్యవిస్తీర్ణం, సరిహద్దులు తెలియని చక్రవర్తిలాగా, భార్య మరణంతో అతను మానసికంగా పెట్రేగిపోయాడు. జీవితగమనం వేగం తగ్గి, నిదానంగా జరుగుతోంది. కాని అతనికి ఆరాటం, ఆవేదన వేగిరపడుతున్నాయి. ఏదో సిద్ధాంతం, సందేశం, జీవిత దృక్పథం అల్లి మనల్నందరినీ అందులో చిక్కించుకుని, స్థిమితపడదామని అతనికి తెలియని సంకల్పం లాగుంది. ఏదో భార్యపట్ల చిన్న అపచారం చేశాడు. దాని తనకు తాను సమర్థించుకొని, పోయిన వ్యక్తి క్షమాపణ పొంది, సమాధానపడటం కోసం ఈ వేగిరపాటు - ఈ శాస్త్రప్రయుక్త

వ్యక్తి స్వైర విహారం, యీ నాద బ్రహ్మ స్మశాన నృత్యం. ఈ వాగ్గేయకారుని చివరి ముక్తాయింపు.

"ఏమైందని అడగవేం?" అంటున్నాడు వెర్రివాడు. అతన్ని గూర్చిన ఆలోచనలు నన్ను వేదాంత శిఖరానికి చేరవేశాయి. ఏది ఏమైతే ఎవరిక్కావాలి? అనంత విశ్వంలోని ప్రచండ నిశ్శబ్దాన్ని, వొక్క మాటతో, వొక్క అర్థశూన్యమైన ధ్వనితో ప్రాచీన ప్రశాంత గాంభీర్యాన్ని భంగపరుస్తున్నాడా వెర్రి మానవుడు.

పైకి మాత్రం 'చెప్పండి' అన్నాను.

"సరోజ నన్ను చేసుకోనని కచ్చితంగా చెప్పేసింది. ఎందుకనీ?" ఆమెకు నామీద ఉండబట్టేగా. తనకు నామీద ఉన్న ప్రేమని మరోలా ప్రకటించలేకపోయింది. అక్క బ్రతికి ఉన్నప్పుడు ఎంత గారాం, ఆప్యాయత, ఆదరణ, స్నేహం చూపిందనుకొన్నావ్. అది వెన్నెల రాత్రి. కల్యాణి రంగమ్మగారితో గుళ్లో కెళ్లింది. అప్పుడే క్లబ్బునుంచి వచ్చి స్నానం చేసి డ్రస్‌చేసుకుంటున్నా. గదిలోకొచ్చింది సరోజ. అద్దంలో నా మొహంకేసి చూసింది.

"నువ్వు ఆలయానికి వెళ్లలేదా" అని అడిగా.

"ఆ ప్రశ్న నేనే అడుగుదామనుకుంటున్నా - నాకేం కోర్కెలు లేవు" అన్నది

అంటే ? అన్నాను.

"పిల్లలు కావాలని వొక్క భార్యమాత్రం ప్రదక్షిణాలు చేస్తే చాలదు. నువ్వూ చెయ్యాలి" అంది. మంచి భర్తని ప్రసాదించమని నువ్వూ కోరుకోవచ్చుగా - అన్నాను దెప్పుతూ. నాకట్లాంటి కోర్కెలూ లేవు, నమ్మకాలూ లేవు అంది. అంతా మానవ ప్రయత్నమే గాని, దేవుడి ప్రమేయం లేదంటావు. నా నమ్మకాలు, ఆదర్శాలు, ప్రయత్నాలు, వాటి ఫలితాలు కాస్తంత ఈ అల్పుడి

# కాలచక్రం నిలిచింది

చెవిని పడెయ్యి. అన్నా వేళాకోళంగా.

'ప్రయత్నం చెయ్యనిదే నాకు పెళ్లికాదంటావ్!'

"పిల్లల కోసం మా ప్రయత్నం లాంటిదే అనుకోగూడదూ" అని తువ్వాలు భుజానవేసుకొని డాబామీదికి నడిచాను. నా సంభాషణంతా అద్దంలో సరోజతోనే. నాకేసి అదోలా చూసింది - అట్లాగనిపించింది. పది నిమిషాల్లో డాబామీదికి తనూ వొచ్చింది.

"కోపం వచ్చిందా ?"

"ఎవరి మీద?"

"నామీద"

"ఎందుకు ?"

"మొగాళ్లకెందుకు కోపమొస్తుందో నాకేం తెలుసు?"

"ఇంకా నాకే వచ్చింది కోపం అవునా?"

"ఎందుకో?"

"స్త్రీ మనస్సు తెలియ బ్రహ్మ తరంబా?"

"పోనీ తెలిసినంత వరకూ చెప్పు - భయంలేదు. రోడ్డువెంట చూస్తున్నాలే. అక్కయ్య రావడం లేదు" అన్నది. నాకు నిజంగా కోపమొచ్చింది. "అక్కయ్యంటే నువ్వు భయపడాలి - నీ మనస్సులో ఏదో వుంటే?" అన్నాను. సరోజకి కోపం వచ్చినట్లుంది. "అక్కయ్యముందు నీ అమాయకపు అవతారం నాకు తెలియదనా- అక్కయ్యకు తెలీదనుకోకేం - నా మనస్సులో ఏదో వుందిట. మహా కనిపెట్టావులే - నా మనస్సులో ఎవరున్నా, లేకపోయినా నువ్వు మాత్రం లేవు" అని కిందికి వెళ్లిపోయింది. అది ప్రేమ కాకపోతే ఏమిటంటావ్?

ఇంటికి చేరుకుని వరండాలోకి కుర్చీలు లాక్కుని కూర్చున్నాం. భోజనానికి హోటల్‌కెళ్లడమా, కేరియర్ తెప్పించటమా అన్న ఆలోచన సాగనియ్యకుండా మళ్లీ మొదలెట్టాడు. ఇంక రాత్రంతా జాగారమే ! ఏ పరమాత్మకీ నాపైన కటాక్షం కలుగదూ! నేను మాట్లాడటం మొదలెడితే! ఒక యత్నం చేశా.

"చూడండి - మీరు సరోజపై మరి కొంత ఆప్యాయత కనబరిస్తే...."

చాల్లెండి సరోజ విషయం మీరెరుగరు. కొందరు స్త్రీలంతే. వాళ్లని తిట్టి, హింసించి, బాధపెట్టినవారినిగాని కనికరించరు. ఓ సారి....

ఇంక లాభంలేదు. ఆ యత్నం విరమించి, చంద్రుడికేసి చూస్తూ నా పగటి కలలు కంటూ కూర్చున్నాను. పగటి కలలు మానవ హృదయానికి స్వర్గం లాంటివి. నాకు క్రాస్‌వర్డ్ పజిల్‌లో ఇరవై వేలొస్తే ఎల్లా ఖర్చు పెట్టేదీ ఊహించుకుంటాను. సరోజను నే చూళ్లేదనుకోండి - వివాహమాడి ఉంటే నా జీవితం ఎల్లా ఉండేదీ ఊహించుకుంటాను. ముకుందం కబుర్లని కల్యాణి ఎట్లా భరించగలిగిందో? ఆమె దగ్గర కూడా ఇల్లాగే మాట్లాడతాడా? ఆవిడ వింటుందా? ఇప్పుడు ముకుందం ఏమంటున్నాడో విందామని పగటికలని తుడిచేసి అతనికేసి చూశాను.

"మా ఆవిడంటుందీ - నేను తనదగ్గరున్నప్పుడు కంటే దూరంగా వున్నప్పుడు తనకి దగ్గరగా వున్నట్లు వుంటుందిట. అట్లాగంటుంది గానీ, దూరంగా వుంటే - ఎప్పుడొస్తారు? అని టెలిగ్రాంల మీద టెలిగ్రాం లిస్తుంది. దగ్గరగా వుంటే ఎప్పుడు వెడతాడురా బాబూ అన్నట్లుగా ప్రవర్తిస్తుంది - మీకూ అలాగే అనిపిస్తోంది కదూ?"

ఒక్కసారి వులిక్కిపడి కుర్చీలోంచి లేచాను.

"ఇంకా నయం - ఎంతమాట !" అన్నాను. ఇంక నాకు ఆ రాత్రికి మోక్షం లేదు. హాయిగా ఆయనకి లొంగిపోయి, ఆ ధ్వనిసాగరంలో పూర్తిగా మునగడం మంచిదనుకుంటూండగా, దైవం నాభక్తికి మెచ్చి, పరంధామయ్యని పంపించాడు. తుఫానులో రైలుదారక్క యిరుక్కుపోయిన వ్యక్తులలో పరంధామయ్య వొకడు. నాకు స్నేహితుడు, ప్రసిద్ధ రచయిత. ఆయన్ని ముకుందానికి పప్పగించి నేను కాస్తంత స్వేచ్ఛ పొందొచ్చు.

"పరంధామయ్య గారని- 'హాయిగొల్పే హానలులు' అనే యాత్రాగ్రంధం వ్రాసారు. అమెరికా, జపాను దేశాలు తిరిగొచ్చాడు" అని ముకుందానికి పరిచయం చేశాను. "అయ్యో



## ఫిరోజ్ డిమాండు

ఫిరోజ్‌ఖాన్ ఎక్కువ మొత్తం డిమాండు చేస్తున్నాడట. కమల్ హాసన్ 'నాయకన్' చిత్రం ఆధారంగా నిర్మించిన ఫ్లాప్ చిత్రం 'దయావన్' తర్వాత ఫిరోజ్ మెహల్‌కుమార్ చిత్రంలో నటించేందుకు ఒప్పుకున్నాడట. ఒప్పుకోవటమే కాదు 18 లక్షలు డిమాండు చేసి నిర్మాత దగ్గర తీసుకున్నాడు మరి ఏం చూసి నిర్మాతలు యింత డబ్బు ముట్టచెప్పారో?

ఆయన్ని ఎరక్కేం... వెనకటికి వోసారి చెళ్ల పిళ్ల వెంకటశాస్త్రి గారికి సజ్జాపురంలో సన్మానం తలపెట్టారు. మా మావగారి తండ్రి అధ్యక్షులట..."

పరంధామయ్య హితం అనుకుని కారియర్ విషయం చూస్తావని బైటకొచ్చి నిశ్శబ్దంగా గాలిపీల్చావని రహస్యంగా ఒప్పుకుంటున్న స్వార్థపరుణ్ణి.

బస్టాండు దగ్గరగాని మునలయ్యకి చుట్ట కాల్చుకునేటందుకు సరైన స్థలం దొరకలేదు. అక్కడ దొరికాడు. తీసుకొచ్చి, క్యారియర్ యిచ్చి, హోటల్‌కి పంపించాను. ఎనిమిది కావస్తోంది. పరంధామయ్య - సాహిత్య సభల్లో గంటలు గంటలు ఉపన్యసించే పరంధామయ్య ఆ ప్రవాహంలో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. నన్ను చూడగానే లేచాడు.

"ఇంతకీ యీాయనెవరో పరిచయం చేశావు కాదు" అన్నాడు కాస్త కోపంగా. సమాధానం చెప్పే ప్రాప్తి నాకు లేదు. ముకుందం దొరకపుచ్చుకున్నాడు.

"నేనూ రచయితనే - వో వెయ్యి పేజీల గ్రంధం వ్రాశాను."

"ఎవ్వరూ చెప్పారు కారేం. అచ్చయిందా?" అన్నాను ఎల్లాగో నందు చేసుకొని.

"అంటే బుర్రలో రాశాను. కాగితం మీద వ్రాయడం ప్రారంభించాలి. చాలా పెద్ద గ్రంధం, రెండువేల పేజీలు పట్టొచ్చు. ఇంకా పేరు పెట్టలేదనుకో-"

"ఏం పేరు పెడితే బాగుంటుందంటారు?"

"విషయమేమిటో తెలిస్తే..." పరంధామయ్య గారి వాక్యం మరో క్షణంలో పూర్తవుతుంది.

"అదే చెబుదామనుకుంటున్నా. మొన్న వ్యవసాయ శాఖవారికి పిటిషన్ పెట్టానా - నేనూ లాయర్నే ఐనా లా పదాలు వాడకుండా, అతి సులువైన, సరళమైన భాషలో వ్రాశానేమో - ఎందుకంటే మా మామ గారింట్లో వంటాయన శరభయ్యకి కూడా ఇట్టే అర్థమైంది. విషయం బోధపడగానే ముక్కుమీద వేలేసుకున్నాడు."

పరంధామయ్య దగ్గరుండడం వల్ల గాబోలు, కొంచెం ధైర్యం చిక్కి సందేహనివృత్తి కుపక్రమించాను.

"మీ మామగారింట్లో ఉన్నది వొంటలక్కగా" అన్నాను. ముకుందాన్ని పట్టి వేయించానని గర్వపడుతూ.

"సరేలే - ఆవిడెప్పుడో వెళ్లిపోయింది. వెండి ముక్కుపొడుం డబ్బా, అరడజ నింగువ సొట్లాలూ తీసుకొని, నేనారా తీశాను. అత్తగారూ వాళ్లూ ఆడదాన్ని యాగి చెయ్యడమెందుకని వూరుకోమన్నారు. శరభయ్యని కుదిర్చి పెట్టింది నేనే - వాడున్నాడే, వంట చెయ్యడంలో భీముడు. అతని చేతి భోజనం వొక్కసారి తిన్నట్లయితే పొట్టిశ్రీరాములు యీనాటికీ జీవించే వుండును. నా గ్రంధంలో ఒక అధ్యాయం అతన్ని గురించే."

"మీరు వ్రాశే గ్రంథం స్వీయ చరిత్రన్నమాట...." "అసలు విషయం చెప్పనివ్వండి - చాలామంది చంపుగు తింటున్నారు. మీ చరిత్ర వ్రాయండని - నాకు తీరికేది? జీవించదల్చుగున్నవారికి గ్రంధరచన పడదేమో, వోసారి..."

భూకంపం ఏ ప్రాంతంలో, ఏ సమయంలో చెలరేగుతుందో ఎవరు చెప్పగలరు? పెద్ద బీటలు తీసింది. పరంధామయ్య నేనూ అందులో పడిపొయ్యాం - వో పావుగంట. తెప్పరిల్లి 'దాహం' అన్నాడు పరంధామయ్య - అని తనే లోపలికెళ్లాడు.

"శరభయ్య మాకక్కర్లేదంటే నాదగ్గరే అట్టే పెట్టేసుగున్నాను. పేరమ్మని నాదగ్గరే వుంచుగున్నాను- ఏం చెయ్యను. తెనుగు భాషలోపం - వుంచుగోక తప్పదు. చురుకైన పిల్ల. మొగుణ్ణి వొదిలేసింది - వాడే వొదిలేశాడనుకో - రంగం వెళ్లాడు. రాజకీయాలు వొదులుకున్నాను. ఆటలు పాటలు వొదులుకున్నాను. కృష్ణా రామా అనుకుంటూ, పొలం, తోట చూసుగుంటూ కడుపులో చల్ల..."

ఇంతలో 'బాబోయ్' అని లోపల్నించి పరంధామయ్య గావుకేక వేశాడు. తొందరగా వెళ్లాం. ఆయనకి తేలుకుట్టిందట. కాలుగట్టిగా అదిమిపట్టి, "మంత్రగబ్బేమో కాస్త చూడండి. ఇది మామూలు తేలుకాదు" అని బాధపడుతున్నాడు. నేను నాలుగు మూలలా చూస్తున్నాను. 'కనబడదేం?' అన్నాను. "నీకు స్వాగతం యిస్తూ ఎదురుగా వొస్తుంది మరీ - మందేం లేదూ? డాక్టరెవరూ లేడు?" అంటున్నాడు.

ముకుందం మళ్లా మొదలెట్టాడు. "ఓసారి పేరమ్మ కిల్లాగే తేలుకుట్టింది. దానికెంత బాధకలిగిందంటే, "చూడు తేలుకుట్టిందర్రోయ్", అని కేకేసింది. కాదు చీమన్నాను నేను. వెదకడం మొదలెట్టారు..."

"డాక్టర్ని తీసుకురండి - మంత్రం వెయ్యలేరూ... మీరిక్కడే వుండండి, డాక్టర్ని తీసుకొస్తాను." అని బైలుదేరాను. "నువ్వు తిరిగొచ్చేసరికి నా ప్రాణమే పోతుంది. ఉండు - నేనే వస్తాను."

నేను పరంధామయ్యని తీసుగుని బైటకెళ్లి వో రిక్షా మాట్లాడి అందులో ఎక్కాం.

"మీకు మంచి టైమ్‌లో అలారం మోగినట్లు - తేలుకుట్టిందండీ. లేకపోతే నా రైలు తప్పను. ప్రొద్దున పదింటికి దిగాను. పది గంటలు లేటన్నారు. అంటే, ఎనిమిదింటికన్న మాట. ఇపుడు పావుతక్కువ ఎనిమిది. కాబట్టి నాకు రైలందుతుంది. మనకి ఢిల్లీ ప్రయాణం తప్పదు. వోసారి నేను లాబర్ కమీషనర్ ఢిల్లీ ప్రయాణం కట్టాం. నాగపూర్ చేరేప్పటికి..." రిక్షా మలుపు తిరిగింది. ఓ జట్కా ఆపుచేయించి ముకుందాన్ని అందులో ఎక్కమని సెలవు తీసుకున్నాం. మమ్మల్ని తన పూరు ఆహ్వానించాడు. అల్లాగే అన్నాం. ఏదో చెబుతున్నాడు. జట్కా దూరంగా వెళ్లింది. రిక్షావాణ్ణి తిన్నగా హోటల్‌కి పట్టమన్నాడు పరంధామయ్య.

కారియర్ యింటికొస్తుందిగా అన్నాను. ఇంటి కెడితే యీసారి నిజంగా తేలు కుడుతుంద న్నాడు పరంధామయ్య!

ఇది జరిగిం తర్వాత ముకుందాన్ని నేను కలుసుగోలేదు. అటు వెడుతూ ఓసారి పరం ధామయ్య, ముకుందం బంగళాని, తోటని చూసి, వో పూట భోజనం చేసి వొచ్చినట్లు వివరాలన్నీ వుత్తరం ద్వారా తెలియబరిచాడు. శరభయ్య వొంట అద్భుతంట. పేరమ్మ బ్యూటీట. రోజూ పదిమంది తక్కువుండ రట భోజనానికి. ఆయనకున్న పలుకుబడి, పేరు, అంతా శరభయ్య వొంట మూలం గానేట. అతని స్వీయ చరిత్ర క్లుప్తంగా నాలుగు గంటలు చెప్పాడుట. అది వినగానే తిన్నదంతా అరిగిపోయిందట. 'నా సంభా షణవల్ల జీర్ణం కాని పదార్థం లేదు' అని ముకుందం నిర్వచనం చేశాడుట.

అట్లాంటి ముకుందానికి ఎందుకు మతి భ్రమించి, పిచ్చాస్పత్రిలో వుండాల్సి వొచ్చిందో నాకు బోధపడలేదు. కొద్దిగా మానసిక శాస్త్రం నేనూ చదివాను.

సంసార సుఖం లేకపోవడం అతి వాగుడికి వో కారణంగా చెప్తారు. ప్రేమతృష్ణ మాటల ద్వారా తీర్చుగుని తృప్తిపడటం చిహ్నం. నాకిది సరైన కారణంగా తోచలేదు. కృత్రిమంగా వూహిస్తే ఏవేవో చిత్రమైన కారణాలు కల్పిం

## కాలచక్రం నిలిచింది

చవొచ్చు. జాడ్యం ఎంత కృత్రిమమైనదో, దానికి మందుకూడా అపూర్వంగా వుంటుంది.

గుడ్డివాడు విసిరిన బెడ్డలాంటిది. మానసిక శాస్త్రంలో మందు తగులుతే తగులుతుంది లేకపోతే లేదు. నే మొదట్లో అనుకున్న కారణమే నాకిప్పటికీ సమంజసంగా కనబ డుతోంది. ముకుందం మంచివాడు. స్వార్థ రహితుడు. జీవితంలో ఏదీ కోరకుండా, అన్నీ తెచ్చుగుని సర్వమూ వొదులుకున్న యోగి. విలువలు కట్టని విమర్శకుడు. సిద్ధాం తాలు అమాయక ప్రజనెత్తిన రుద్దని వేదాంతి.

అయినా అతని బారినుండి పారిపోవడానికి నేనూ యత్నం చేశాను. భార్య విసుగెట్టి ఇంక చాలు బాబు అనుకుని పరమ పదించింది. సరోజ పెళ్లి చేసుకోనంది. అందరూ అత న్నుండి పారిపోయి అతన్ని ఏకాకిని చేశారు. నా కళ్లంట అప్రయత్నంగా నీళ్లు తిరిగినై. పాపం అతనేం అపచారం చేశాడు? రెండు రూపాయలిచ్చి కర్నాటక విద్వాంసుడు, వయొ లిన్, మృదంగం విద్వాంసులు కలిసి మూడు గంటలు ముమ్మొన యుద్ధం సాగిస్తే చూసి, విని "అహ, ఎంత అద్భుతంగా వుందండీ" అని చెప్పగోవడం లేదు? మనం ఖర్చుపెట్టిన రెండు రూపాయలనీ సమర్థించేటందుకుకాక, మరెందుకు మనం మెచ్చుగోడం? కానీ ఖర్చు లేకుండా ముకుందం మనకి వినోదం కలిగిస్తే ఏవగింపా? అతనికి పేర్లెట్టి హేళన చెయ్య డమా?

నీతిలో మెళకువయి తెలుసున్నవాడు ముకుందం, ఏనాడో భార్యకి అపచారం చేశాడు. దాన్ని ఎదుర్కొన్నాడు. తను సమాధానం పడలేకపోయ్యాడు. సంఘానికి చెప్పేసి, పాపపరిహారాని కుపక్రమించాడు మాటల ద్వారా, అదీ నాకు తోచిన కారణం. అతనా జీవితంలో దేన్నీ కోరడు. ప్రతిఫలం కోరని సంభాషణ-అతని మాట పడిపోయిం దంటే నాకీ ప్రపంచంలో ఏదో తీరనిలోటు కనబడింది. అతని భార్య కల్యాణి అన్నట్లు, అతను దూరంగా వున్నకొద్దీ దగ్గరగావొచ్చిన ట్లుంటాడు, దగ్గరగా వుంటే తప్పించుకు తిరుగుతాను. నాకు క్షమలేదు.

అతని జీవితంలో ఏదోలోటుంది. దాన్ని శోధించి ఎవ్వరూ బైటపెట్టకుండా అతను 'మాటలు' అనేవల అల్లుకున్నాడు. అతన్ని కదిపి మాట్లాడిస్తే అదేవిటో బైటపడును. కాని ఇప్పుడు ఆ అవకాశం లేదు. అతనికి మాటపోయింది. కాలచక్రం నిలిచినట్లయింది. దిగులుగా కూర్చున్నాను. "పోనీ వోసారి వెళ్లి


పై వారమే

ప్రత్యేక వ్యాసం

జలుబు, దగ్గు, తుమ్ములు ఎందుకొస్తాయి?

చూసిరాకూడదూ?" అంది మా ఆవిడ.

ఆ రాత్రే బెంగుళూరు ప్రయాణం అయ్యాను. హాస్పిటల్‌కి వెళ్లేప్పటికి సాయంత్రం నాలుగైంది. బైట ముకుందం తమ్ముణ్ణి కలుసుకున్నాను. అతను చెప్పాడు కొన్ని సంగతులు-పనిపిల్ల పేరమ్మ వంటాయన శరభయ్యతో లేచిపోయిందట. వాళ్లని వెదుక్కుంటూ తిరిగాడుట ముకుందం. పేరమ్మని రైలుస్టేషనులో పట్టుకున్నాడుట. ఇద్దరినీ ఇంటికి రమ్మని బ్రతిమాలాడాట్ట, జీతం ఎక్కువ చేస్తానన్నాడుట. రానందిట. ఏవో వాగిందిట-అతని మామగార్ని , భార్యని, సరోజని-వాళ్ల కుటుంబాన్ని చులకనచేస్తూ మాట్లాడిందిట. లెంపకాయ కొట్టాడుట. మళ్లా ఏదో అందిట."నేనందుకు కావాల్సివొచ్చానా? ఇప్పుడనండి ఏమంటారో?" అని సవాల్ చేసినట్లు మాట్లాడిందిట. పళ్లు బిగబట్టి, మొహం ఎర్రగా అయి, చేతులతో రక్కేటట్లుగా అభినయం చేశాట్ట. కాని నోటంట మాట రాలేదుట. ఇవన్నీ పేరమ్మ చెప్పిందట.

జీవితంతో ఏదీ ఆశించని వాడికి అసంతృప్తి వుండదు. కోరింది లభించలేదన్నప్పుడు వొచ్చే కోపం రాదు. ముకుందం ఉద్రేకాలకి అతీతుడు. కార్యశూరులు కోపానికి గురవుతారు. అతను ఏకార్యం తలపెట్టడు. చెయ్యడు, కోపం అంటే ఏమిటో ఎరగని అమాయకుడు. అట్లాంటి ముకుందాన్ని పేరమ్మ రెచ్చగొట్టింది. కోపం తెప్పించింది. దాని తీవ్రతకి అతని శరీరం తట్టుకోలేక పోయింది. వ్యక్తిత్వానికి షాక్ తగిలింది. తేరుకోలేకపోయ్యాడు. 'మాట' అతని ఆయుధం. అతని ఆయువుపట్టు. దాన్నే సవాల్ చేసింది పేరమ్మ, ఆయువుపట్టు మీద దెబ్బ కొట్టింది. ఊహాజగత్తు పేలిపోయింది. మానసిక గోళాలు ఢీకొన్నాయి. వాటి మధ్య నలిగి కాలచక్రం నిలిచిపోయింది.

లోపలికెళ్లి చూశాను. దిగులుగా కూర్చున్నాడు. పెరిగిన గడ్డంలో తెల్లవెంట్రుకలున్నాయి, కళ్లక్రింద గీతలున్నాయి. జుట్టంతా చిందర వందరగా వుంది. పిచ్చివాడులా వున్నాడు. నన్నుచూశాడు. నా కళ్లల్లోకి లోతుగా చూశాడు. ఏమీ మార్పులేదు అతని ముఖంలో. మందహాసంలేదు. నేను ఫలనా అన్నా చైతన్యం లేదు. నాకు జాలేసింది. ఇల్లాగన్నాను.

"ముకుందంగారూ-మీరు జీవితంలో అన్నీ సాధించారు. వొక్కటే తప్ప, మౌనంగా, నిశ్శబ్దంగా వుండటంతప్ప అన్నీ సాధించారు. మీరు నిండైన, పరిపూర్ణులైన ధన్యజీవులు."

ఏదో చప్పుడైంది-సంకెళ్లు వూడినట్లు, సముద్రం వెనక్కి వెళ్లి ఎండినట్లు, భూకంపం బీటలు మూసుగుని లోలోన అణగారినట్లు, కాలచక్రం వొక్కసారి కదిలినట్లు-

"ఆ-నేను మాట్లాడలేనంటారా? నేను మూగనా- నిశ్శబ్దమా-మౌనమా...ఎందుకు మాట్లాడలేను. వినడం చేతకాని వారికి మాట్లాడ్డం చేతకాదు. వారే మూగవారు. ఓసారి విజయనగరంలో అష్టావధానం జరిగింది. పదిమందీ పది ప్రశ్నలడుగుతారు. వారికి సమాధానాలు, గంట తర్వాత, క్రమంలో చెప్పాలి. నేనో ప్రశ్న అడిగాను, తికమకగా-కాకిగూటిలో చిలుక పిల్ల వుంటే తోడేలు చెట్టుకింద వున్నప్పుడు, పెద్దపులి అరుస్తే, భయపడేది, చిలుక పిల్లా, కాకా, తోడేలా-క్రమంలో చెప్పాలి..."

అల్లా ముకుందంగారు యధావిధిగా తన ధోరణి సాగించారు. ఆయన మాట్లాడిన వాక్యానికి ప్రతిధ్వనిలేదు. వాక్యం ముగించినప్పుడు కదా ప్రతిధ్వని వినబడేది? ఆ ముగింపులేదు-ఆ ప్రతిధ్వని లేదు.

ఈ కథలో ముకుందానికి అన్యాయం చేశానా ఎక్కడైనా అని తిరిగి చూశాను. ఒకచోట చేశాను. రైళ్లాగిపోయి, రెండోసారి నన్ను కలుసుగున్నపుడు. 'రండి టీ తాగొద్దాం' అని ముకుందం అన్నట్లుగా వ్రాశాను. అది పొరబాటు, అట్లా ముకుందం అనలేదు. అనడు. టీకీ, భోజనాలకీ, స్థూల జగత్తులో శారీరకావసారలకీ అతనికి టైము లేదు. వీటితో ఆ ఊహా సామ్రాజ్య చక్రవర్తికి నిమిత్తం లేదు. అతను హాస్పటల్‌లో వున్న ఆ వారం రోజులే కాలచక్రానికి విరామం.

## త్రాగుబోతు

## అనుపమ్

విభిన్న తరహా పాత్రలు పోషిస్తున్న అనుపమ్‌ఖేర్ 'డాడీ' చిత్రంలో త్రాగుబోతుగా నటించాడు. మహేష్‌భట్ నిర్మించిన ఈ చిత్రంలో ఖేర్ నటనకు మెచ్చిన న్యాయనిర్ణేతలు జాతీయ ఫిల్మోత్సవంలో ఒక ప్రత్యేక అవార్డును యిచ్చారట. పది నిరర్థకమైన పాత్రలు చేయటం కంటే యిలాంటి ఒక మంచి పాత్ర, తాను మెచ్చిన పాత్ర చాలంటున్నాడు. ఈ చిత్రం ఎప్పుడు విడుదలవుతుందా అని ఎదురు చూస్తున్న అనుపమ్‌ఖేర్.